సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



'దాల్మియా' వైఖరి దారుణం

ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులు పట్ల దాల్మియా యాజమాన్యం అన్యాయంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. -8లో



అమ్మభాషకు అక్షర రూపమిద్దాం!

మనసులోని భావాలను స్పష్టంగా వ్యక్తీకరించగలిగేది ఒక్క మాతృభాషలోనే. అలాంటి అమ్మభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. -8లో

గరిష్టం/కనిష్టం
35.6/21.0

వాతావరణం

జిల్లాలో గురువారం 21.0 - 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

బీఈడీ పరీక్షలు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్‌: యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని బీఈడీ కళాశాలల్లో 1,3 సెమిస్టర్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాల్లో గురువారం ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె. ఎస్.వి. కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడపలో ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని 10 కేంద్రాల్లో, అన్నమయ్య జిల్లాలోని ఐదు కేంద్రాల్లో తొలి రోజు 4,713 మంది పరీక్షలు రాశారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు.

డబ్ల్యూడీసీ ద్వారా జిల్లాలో సాగులోకి లక్ష ఎకరాలు

కడప సెవెన్‌రోడ్స్‌: వాటర్ షెడ్ డెవలప్మెంట్ కమిటీల (డబ్ల్యూడీసీ)ను సమర్థవంతంగా నిర్వహిస్తూ అనుబంధ శాఖల సమన్వయంతో వచ్చే ఏడాదికి జిల్లాలో లక్ష ఎకరాలను సాగుబడిలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి డ్వామా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాటర్ షెడ్లు, ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు, స్టార్మ్, రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా సమీప నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుతో మెట్ట భూములను సాగులోకి తీసుకురావాలన్నారు. వ్యవసాయంలో అంతర్భాగమైన ఉద్యాన, ప్రకృతి సాగు, పాడి, మత్స్య సంపదను గ్రామాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం సీఎస్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్ కుమార్ సహజ పద్ధతుల ద్వారా వ్యవసాయ సాగును ప్రోత్సహించేందుకు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ ను పీపీటీ ద్వారా వివరించారు. డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, సీఎస్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్ కుమార్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, ఉద్యాన శాఖ డీడీ సుభాషిణి, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీపుల్ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

కడప సెవెన్‌రోడ్స్‌: ప్రగతి పథంలో నడిపించి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన పీపుల్ సర్వేని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పి-4 విధానం (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్ షిప్) ద్వారా పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడానికి జీవన ప్రమాణాలలో అట్టడుగు స్థాయిలో గల 20 శాతం మంది నిరుపేదలను గుర్తించడానికి నిర్వహించనున్న సర్వే పై జిల్లా కలెక్టర్.. జెడ్పి సీఈఓ, డీపీఓ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేసి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇల్లు పేదరికాన్ని అధిగమించి ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పి-4 పాలసీని అమలు చేస్తోందన్నారు.

సిసోడియాను కలిసిన కలెక్టర్: మదనపల్లి నుంచి విజయవాడకు వెళుతూ కడపలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో బస చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (రెవిన్యూ) ఆర్‌పీ సిసోడియాను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకరి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెవెన్యూ పరమైన అంశాలను కలెక్టర్ ఆయనకు తెలియజేశారు.

త్వరితగతిన లక్ష్యం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ఓఎస్డీ రమేష్

కడప అగ్రికల్చర్: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బిందు, తుంపర సేద్యం లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగు పథకం(ఏపీఎంఐపీ) ఓఎస్డీ రమేష్ పేర్కొన్నారు. గురువారం కడప కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపీ జిల్లా కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి తుంపర, బిందు సేద్యానికి సంబంధించి జిల్లాకు 15000 హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 8666 హెక్టార్ల లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. అలాగే క్షేత్రస్థాయిలో సూక్ష్మ సేద్య పరికరాలు అవసరం ఉన్న రైతులను గుర్తించి ప్రాథమిక తనిఖీలు చేపట్టి డ్రిప్పు పరికరాలను సరఫరా చేయాలన్నారు. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరెడ్డి, ఏపీడీ మురళీ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా సమస్యలే!

- రిమ్స్‌లో ఓపి, ఐపీ విభాగాల్లో నిర్లక్ష్యం
- డాక్టర్ల పర్యవేక్షణ అంతంతమాత్రమే
- కొన్ని వార్డులలో వైద్య సేవలు అందిస్తే 'కానులు'కురిపించాల్సిందే
- ఐపీ, ఓపీ విభాగాల్లో కుక్కల బెడద, దొంగల బెడద పరామామూలే!



సెంట్రల్ ల్యాబ్ వద్ద రిజిస్ట్రేషన్‌కు క్యూలో వున్న రోగులు, వారి సహాయకులు

కడప అర్బన్: కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో నిర్లక్ష్యం, అవినీతి, అభద్రతలాంటి అంశాలు 'అన్నీ'సాధ్యమేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారులు ఔనంటే అవుననీ, కాదంటే కాదనే వ్యవహారం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రిమ్స్ ఓపి విభాగంలో రోగులను పరీక్షించేందుకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు వైద్యులు తమ దగ్గరికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి తగిన వైద్య సహాయం అందించాల్సి ఉంది. ఈ మధ్య కాలంలో కొన్ని విభాగాల్లో ఆయా విభాగాల హెచ్ఓడీలు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వదిలేస్తే, వారు సీఎస్‌లకు, సీనియర్ రెసిడెంట్‌లకు, పీజీలకు గానీ వారి బాధ్యతలను అప్పగించి ఎంచక్కా తమ అధికారిక పర్యటనలకు, సమీక్షల పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నారు. పీజీలు, సీనియర్ రెసిడెంట్‌లలో కొందరు మాత్రం చిత్తశుద్ధితో విధులను నిర్వర్తిస్తే, మరికొందరు మాత్రం 'ఏముందిలే' అని తమదారిన తాము వెళ్లిపోతున్నారు. విధులను హౌస్ సర్జన్‌లకు, వైద్య విద్యార్థులకు వదిలేసి వెళుతున్నారు ఒకరిద్దరు డాక్టర్‌లు తమ పనివేళల్లోనే 'మహిళా ఉద్యోగిని'లను తమ ఛాంబర్‌లోకి పిలిపించుకోవడం, వారితో వెకిలిచేష్టలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన ప్రజల గురించి ఆలోచించకుండానే తాము మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉన్న వైఖరిని గమనిస్తున్న ఉద్యోగులు కూడా విస్తుపోతున్నారు.

- సెంట్రల్‌ల్యాబ్‌లోని కొన్ని విభాగాలలో కొందరు ఉద్యోగులు మాత్రం ల్యాబ్ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులకు తమ విధులను వదిలేసి తాము 'సెల్‌ఫోన్'లలో ఇన్‌స్టా, వాట్సాప్‌లను చూసుకుంటూ, లేదంటే ఫోన్ వచ్చిందని పక్కకు జారుకుంటూ రోగులను గంటల తరబడి ఎదురుచూసేలా చేస్తున్నారు. దీనివల్ల రోగులు, వారి సహాయకులు ఇబ్బందులకు గురవుతున్నారు.
- ఓపీ, ఐపీ విభాగాలలో కొందరు డాక్టర్లకు తమ ఛాంబర్లను వదిలి బయటకు వెళ్లేటపుడు తప్పనిసరిగా లైట్, ఫ్యాన్ 'ఆఫ్'చేసి వెళ్లాలన్న ధ్యాసకూడా ఉండదు. తమపాటికి తాము వెళ్లిపోతే క్రింది స్థాయి సిబ్బంది కూడా 'లైట్లు''ఫ్యాన్'లు తిరుగుతున్నా, వెలుగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.
- రోగుల సౌకర్యార్థం 2007-08 సమయంలో పాత రిమ్స్ నుంచి- కొత్త రిమ్స్ వరకు అప్పటి కార్పొరేట్ స్థాయి సంస్థల విరాళంతో నాలుగు బస్సులను ఏర్పాటు చేశారు. ఆసుపత్రి అభివృద్ధి నిధులనుంచి ఆయా బస్సుల నిర్వహణ కోసం డబ్బులను ఖర్చుపెట్టి 'ఉచితం'గా రోగులను పంపించేవారు. తర్వాత రవాణా సౌకర్యాలు మెరుగుపడటం, ఆటోలు, కార్లు, మోటార్ సైకిళ్లలో ప్రయాణాలు సాగిస్తున్నారు. బస్సులు కాలం చెల్లిపోయాయని మూలన పడేశారు. సూపరింటెండెంట్ వాహనాన్ని ఇటీవలనే పక్కన పెట్టారు. రోగులకు మాత్రం జేబులు చిల్లులు పడుతున్నాయి. సూపరింటెండెంట్‌కు గత ఏడాది నుంచి వాహనాన్ని సమకూర్చారు. కాన్పుల వార్డులో 'ప్రసవ వేదన'తో వచ్చే మహిళల నుంచి కొందరు వారి కాన్పులు, శస్త్రచికిత్సల అనంతరం ఒక్కొక్కరి నుంచి రూ. 1000 నుంచి 2000 వరకు డబ్బులను ముక్కు పిండి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా, ఇతర జిల్లాల నుంచి కడప రిమ్స్‌కు 'కాన్పుల' కోసం వస్తే ఇక్కడ మాత్రం డబ్బులను వసూలు చేస్తూ పరిపాలన యంత్రాంగానికి 'చెడ్డపేరు'తీసుకువస్తున్నారు. క్రింది స్థాయిలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులే ఈ చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.
- కొన్ని వైద్య విభాగాలలో రోగులకు వైద్య సేవలను అందించాలంటే 'నిర్లక్ష్యం'కనిపిస్తోంది. వీల్‌ఛెయిర్స్, స్ట్రెక్చర్స్ లేక చాలా సందర్భాల్లో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నడవలేని, నిస్సహాయ స్థితిలో వున్న రోగులను తరలించాలంటే వారి సహాయకులు, బంధువులు చేతులమీదుగా, భుజాల మీదనే తీసుకురావాల్సి వస్తోంది. దాతలు ఇచ్చిన కొన్ని వీల్‌ఛెయిర్స్‌ను 'భద్రం'గా దాచిపెట్టుకుంటున్నట్లు సమాచారం. వైద్యంలో భాగంగా ఆపరేషన్లను నిర్వహించిన తర్వాత రోగుల బాగోగులను పట్టించుకునే విషయంలో కొందరు వైద్యులు, వైద్య సిబ్బంది 'బాధ్యత'గా వ్యవహరించకపోవడం గమనార్హం.
- ఓపిలోని రేడియాలజీ విభాగంలో 'ఎక్స్‌రే'యూనిట్‌ల విషయానికి వస్తే మొత్తం ఆరు యూనిట్లు ఉండాల్సి ఉండగా వీటిల్లో ఓ యూనిట్ గదిని మూసివేశారు. మిగతా యూనిట్లలో ఉన్న ఎక్స్‌రే పరికరాలన్నీ 'మొబైల్'ఎక్స్‌రే యంత్రాలే కావడం గమనార్హం. ఎక్స్‌రే ఫిల్మ్‌లు లేకపోవడం, ఎక్స్‌రే తీశాక సంబంధిత డాక్టర్స్ మొబైల్‌ఫోన్‌లకు ఆన్‌లైన్‌లో పంపిస్తున్నారు. అత్యవసరంగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినా, రెఫర్ చేసినా ఇబ్బందులు 'తప్పవు. ఐపీ విభాగంలో వైద్య సేవలకు వచ్చిన వారిలో ఎక్కువ మందిని 'ఆరోగ్యశ్రీ'వైద్య సేవలకే ప్రాధాన్యత ఇస్తూ నమోదు చేసి వైద్య సేవలను అందిస్తున్నారు. రోగులకు నమోదు చేసి వార్డులలో అడ్మిట్ చేసే ఉన్న 'శ్రద్ధ' మళ్లీ డిశ్చార్జ్ అయ్యేవరకు వారికి అందించాల్సిన వైద్య సేవలపై 'పర్యవేక్షణ లేకపోవడం కొందరి వైద్యుల, వైద్య సిబ్బంది నిర్లక్ష్యవైఖరికి పరాకాష్ట.



ఓపీ విభాగంలో వున్న కోతులు

- ఐపీ. ఓపీ విభాగాల కారిడార్‌లలో, వార్డుల్లో కుక్కలు, కోతుల బెడద రోజురోజుకు ఎక్కువవుతూనే ఉంది. ఇంకా మోటార్‌సైకిళ్లు, వార్డులలో సెల్‌ఫోన్‌లు ఎప్పటికప్పుడు కాజేస్తున్న సంఘటనలు నిత్యం జరుగుతూనే వున్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. డాక్టర్లు, వైద్య సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ చేస్తున్నాం. మంగళ, శుక్రవారాల్లో తప్పనిసరిగా ప్రతి వార్డును తిరిగి రోగుల సమస్యలను వ్యక్తిగతంగా అడిగి తెలుసుకుంటున్నాం.ఎలాంటి సమస్యలు రాకుండా మా వంతు బాధ్యతగా వ్యవహరిస్తాం. - రమాదేవి, సూపరింటెండెంట్, రిమ్స్,కడప

23 నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు నెల 23వ తేదీ నుంచి మార్చి 5 వరకు జరనున్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్లను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గురువారం ప్రధాన అర్చకులు, ఆలయ ఈవో డివి రమణారెడ్డిలతో కలసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మహా సంప్రోక్షణకు ఏర్పాట్లు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో జీర్ణోద్ధరణ పనులు పూర్తయిన వెంటనే నిర్వహించే మహా సంప్రోక్షణకు తిరుమల-తిరుపతి దేవస్థానం అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రధాన గోపురాన్ని భక్తులు వీక్షించేందుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. కొన్ని నెలల తర్వాత గర్భాలయంలోని సీతారామ లక్ష్మణ మూర్తుల దర్శన భాగ్యం కల్పించనున్నందున ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే నెల 5 నుంచి 9వ తేదీ వరకు మహా సంప్రోక్షణ కార్యక్రమం ఉంటుందని టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు తెలిపారు. ఇందులోభాగంగా మార్చి 6 నుంచి 8 వతేదీ వరకు సాయంత్రం 5 గంటలకు అఖండ రామనామ భజన సంకీర్తనలు, శ్రీమద్రామాయణ సంగీత స్వరార్చన, రామాయణ ఉపన్యాసాలు జరుగుతాయన్నారు.

రాయచోటి సబ్ జైల్ తనిఖీ

రాయచోటి టౌన్: రాయచోటి సబ్ జైల్‌ను రాష్ట్ర సేవాధికార సంస్థ ఉమ్మడి కడప జిల్లా సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడారు. ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100 తదితర అంశాల గురించి వివరించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాకు చెందిన పలువురు నాయకులను రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియమిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా డి. భాగ్యమ్మ, రాష్ట్ర కార్యదర్శిగా కె. ఉమామహేశ్వరి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా వై. లక్ష్మి ప్రసన్న, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా బి. వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా పి. వెంకట సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎం. వీర భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఎస్. బసవరాజు, రాష్ట్ర కార్యదర్శిగా కొప్పల శివ వరప్రసాద్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీలుగా చింతకుంట బ్రహ్మయ్య, ఏ. వెంకట శివయ్య యాదవ్, స్టేట్ బూత్ కమిటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఈవై యెద్దారెడ్డి, స్టేట్ బూత్ కమిటీ కార్యదర్శిగా ఎస్‌బి అబ్దుల్ జబ్బార్, స్టేట్ బూత్ కమిటీ జాయింట్ సెక్రటరీగా డి. చంద్ర మౌళి, స్టేట్ పంచాయితీరాజ్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా పి. నాగార్జునరెడ్డి, స్టేట్ పంచాయితీరాజ్ వింగ్ కార్యదర్శిగా ఎస్. శివనాగిరెడ్డి, స్టేట్ జాయింట్ సెక్రటరీగా ఎం. రాజారెడ్డిలను నియమించారు.

అధికారులూ.. మీకిది తగునా?

టాస్క్ ఫోర్స్: ప్రజా ప్రతినిధులతో అధికారులు కలవడం పాలనలో ఒక భాగం..కానీ నేడు వారికి సంబంధించిన కుటుంబ సభ్యులతో అంట కాగుతూ ...వారి సేవల్లో కొందరు అధికారులు విధులకు డుమ్మా కొట్టి తరిస్తుండటంపై సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు, సిబ్బంది వారి విధులను ప్రక్కన పెట్టి రాజకీయ నాయకుల దృష్టిలో పడేందుకు అనేక రకాల పాట్లు పడుతున్నారు. ఈ కోవలోనే అన్నమయ్య జిల్లాకు చెందిన మంత్రి మేనల్లుడు తిరుమలకు వెళుతుండగా ఆయన ఆశీస్సుల కోసం రాయ చోటికి చెందిన కొంతమంది మున్సిపల్, పోలీస్, ఇతర శాఖలకు చెందిన అధికారులు పూల బొకేలు, భారీ దండలతో స్వాగతాలు పలకడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఉన్నతాధికారుల సైతం ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవడానికి భయపడుతున్నట్లు తెలియవచ్చింది.



మంత్రి మేనల్లుడికి గజమాలతో స్వాగతం పలుకుతున్న వారిలో ఒకరు పోలీసు, మరొకరు మున్సిపల్‌శాఖలోని అధికారి

కట్టుదిట్టంగా గ్రూప్-2 మెయిన్ పరీక్షలు

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ఏపీపీఎస్సీ గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్ పరీక్షలను ఈ నెల 23న కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం ఏపీపీఎస్సీ గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో లైజన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పార్ట్-1 సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పార్ట్-2 సెషన్ ఉంటుందన్నారు. జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుంచి 9.45 గంటల వరకు, 1.30 గంటల నుంచి 2.45 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గ్రూప్-2 మెయిన్ పరీక్షలకు సంబంధించి హెల్ప్ డెస్క్ 08562-246344 నంబరు ఈనెల 21 నుంచి 23వ తేది వరకు కార్యాలయ సమయాల్లో పనిచేస్తుందన్నారు. అభ్యర్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వివరాలు

- కేఎల్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్, కృష్ణాపురం, తాడిగొట్ల, చింతకొమ్మదిన్నె మండలం
- గవర్నమెంట్ కాలేజ్ ఫర్ మెన్ (ఆర్ట్స్ కాలేజ్), కలెక్టరేట్ వద్ద, రిమ్స్ రోడ్డు, కడప
- కేఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కృష్ణాపురం , చింతకొమ్మదిన్నె మండలం
- అన్నమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, ఆర్టీవో ఆఫీస్ వద్ద, రాయచోటి రోడ్డు, చింతకొమ్మదిన్నె మండలం
- గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్, హెడ్ పోస్ట్ ఆఫీస్ సమీపంలో, కడప.
- శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (స్విస్ట్), పులివెందుల రోడ్, కృష్ణాపురం, తాడిగొట్ల గ్రామం, చింతకొమ్మదిన్నె మండలం
- శ్రీహరి డిగ్రీ కాలేజ్, తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద, బాలాజీ నగర్, కడప
- శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఎస్వీ డిగ్రీ కళాశాల వద్ద, బాలాజీ నగర్, కడప
- నారాయణ జూనియర్ కాలేజ్, హరి టవర్స్, నాగరాజు పేట, కడప
- ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, నాగరాజుపేట, కడప.
- నాగార్జున డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, ఆర్టీసీ బస్టాండు వద్ద, అరవింద నగర్, కడప.
- శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, వై జంక్షన్ సమీపంలో, పక్కీరుపల్లె రోడ్డు, కడప
- కేఓఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కృష్ణాపురం, చింతకొమ్మదిన్నె మండలం.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియేట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్‌చెరుకూరి తెలిపారు.గురువారం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కావేటి విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ వర్చువల్ విధానంలో ఏర్పాట్లపై సమీక్షించారు. ఇంటర్ పరీక్షలు ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా నిర్వహించాలని సీఎస్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు.

వన్యప్రాణులు విలవిల!

- ఎండ తీవ్రతతో అల్లాడుతున్న వన్యప్రాణులు
- దాహార్తితో అలమటిస్తున్న పరిస్థితులు..
- అడవిదాటుతున్న నేపథ్యంలో.. ప్రాణాలకు ముప్పు
- ప్రత్యామ్నాయం చేపట్టని సర్కారు



అడవిలో నీటి కోసం నెమలి వెతుకులాట



సాసర్‌పిట్‌లో నీటితో నింపుతున్న అటవీ సిబ్బంది (ఫైల్)

రాజంపేట: వేసవి ముంసుకొస్తోంది.. ఫిబ్రవరి మాసం నుంచే వన్యప్రాణులు దాహార్తితో అలమటిస్తున్నాయి.అడవిని దాటుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వన్యప్రాణుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకున్నారు. వీటి సంరక్షణకు అవసరమయ్యే నిధులను ఇప్పటి ప్రభుత్వం సరిపెట్టలేకపోతోందన్న అపవాదును మూటకట్టుకుంది. కంపానిధులు, బయోసాట్ పథకాల కింద నిధులు విడుదల కాలేదు. దీంతో నీటి ట్యాంకర్లతో నీటిని నింపేందుకు అటవీశాఖ ఆపసోపాలు పడుతోంది. వేసవిలో వన్యప్రాణులు సంరక్షణపై నీలినీడలు అలుముకున్నాయి.

రేంజ్‌లిలా..

వైఎస్సార్ జిల్లా రేంజ్ పరిధిలో కడప, ఒంటిమిట్ట, సిద్ధవటం, వేంపల్లె, ముద్దనూరు, ప్రొద్దుటూరు, వనిపెంట, పోరుమామిళ్ల ,బద్వేలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లా పరిధిలో రాజంపేట, చిట్వేలి, సానిపాయి, బాలపల్లె, రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లె, పీలేరు రేంజ్‌లున్నాయి.

జనారణ్యంలోకి..

ఉభయ జిల్లాలో ఉన్న అభయారణ్యాల్లో వన్యప్రాణులు నీటి కోసం అలమటిస్తున్నాయి. అవి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. శేషాచలం, లంకమల అభయారణ్యం, పెనుశిల అభయారణ్యాల్లో వీటి దాహార్తి తీర్చేందుకు అటవీపల్లెల వైపు చూస్తున్నాయి. మరోవైపు అడవికి నిప్పురాజుకున్న క్రమంలో వన్యప్రాణాలు గందరగోళ పరిస్థితులో పడి ప్రాణాలు కాపాడుకునేందుకు అటవీ శివారుపల్లె వైపు పరుగులు తీస్తున్నాయి. మరికొన్ని ఆహారం, నీటి కోసం కూడా వచ్చి ప్రాణాలు పోగుట్టుకుంటున్నాయి. గురువారం సిద్ధవటం రేంజ్‌లో ఇలాంటి సంఘటన చోటుచేసుకున్న సంగతి విధితమే.

- వేసవి ప్రారంభానికి ముందే ఫిబ్రవరి మాసంలోనే భానుడు ప్రచండ నిప్పులు చెరుగుతున్నాడు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఇక అటవీ ప్రాంతంలో గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీరు దొరకడం గగనంగా మారడం గమనార్హం.భానుడిసెగతో వన్యప్రాణులు విలవిల లాడుతున్నాయి.

జిల్లా	రేంజ్‌లు	విస్తీర్ణం(హెక్టార్లు)
వైఎస్సార్	9	2లక్షల94వేలు
అన్నమయ్య	8	2లక్షల74వేలు

అభయారణ్యాలు: శేషాచలం, లంకమల, పెనుశిల, నల్లమల

పగలు కన్నా..రాత్రుల్లోనే నీటికోసం..

అటవీ ప్రాంతంలో ఉన్న వన్య ప్రాణులు పగలుకన్నా..రాత్రుల్లోనే నీటికోసం అటవీ గ్రామాల శివారుల్లోకి వచ్చేస్తున్నాయి. రాత్రి వేళలో తోటల్లోకి వచ్చి నీటి కోసం పరుగులు తీస్తున్నాయని ప్రత్యక్షంగా చూసిన రైతులు అంటున్నారు. వీటి వల్ల తోటలకు ఎటువంటి హాని ఉండదని, ఏనుగులతో హాని ఉంటుందని చెబుతున్నారు. తెల్లవారుజాము వరకు మైదాన ప్రాంతంలోనే దాహార్తి తీర్చుకొని సేద తీరుతుంటాయి. గుక్కెడు నీటికోసం నీటి చలమలను వెతుకొంటూ వస్తున్నాయి.

ఏవేవి వస్తున్నాయంటే..



అటవీ ప్రాంతంలో జింకలు, దుప్పిలు, కొండ గొర్రెలు, అడవి బర్రెలు, అడవి పందులు, నెమళ్లు, చిరుతలు, పెద్దపులి, హనిబాడ్జర్,మనుబోతు, కణుజు, రోషకుక్కలు, తోడేళ్లు, నక్కలు, ఎలుగుబంట్లుతోపాటు ఇతర జంతువులు, పక్షులు నీటి కోసం జన నివాసాల వైపు అడుగులు వేస్తున్నాయి. సంచరించే ప్రాంతంలో నీటి వనరులు లేనప్పుడే ఈ పరిస్థితులు ఆవిర్భవించనున్నాయి.

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు



వన్యప్రాణాలు దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.ఫిబ్రవరి నుంచి వేసవి పరిస్థితులు తీవ్రంగా ఉన్నట్లు కనిపిస్తోంది. సాసర్‌పిట్, నీటి కుంటల్లో నీటిని నింపుతాము. 130 సాసర్‌పిట్స్‌లో రెండురోజులకొకసారి నీటితో నింపుతున్నాం. వన్యప్రాణులతో పాటు అడవులను కాపడుకునే బాధ్యత తీసుకున్నాం. -జగన్నాథ్‌సింగ్, జిల్లా అటవీ అధికారి, రాజంపేట

క్లుప్తంగా

అక్రమంగా వేప మొద్దులు తరలిస్తున్న లారీ సీజ్



సీజ్ చేసిన వేప మొద్దుల లోడ్‌తో ఉన్న లారీ

అట్లూరు : అనుమతులు లేకుండా వేపచెట్లను నరికి తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు తహసీల్దార్ సుబ్బులక్షుమ్మ తెలిపారు. గురువారం అట్లూరు రెవెన్యూ పొలంలోని రెడ్డిపల్లి దగ్గర ఎలాంటి అనుమతులు లేకుండా వేప చెట్లను నరికి తరలించేందుకు లారీకి లోడు చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు లారీని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. చెట్లను నరికి ఎక్కడకు తరలిస్తున్నారనే అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైలులో నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు



రైలులోనుంచి పడి గాయపడిన యువకుడు

ముద్దనూరు : మండలంలోని చింతకుంట గ్రామ శివారులో గురువారం రైలులో నుంచి పడి ఉత్తరప్రదేశ్‌కు చెందిన అర్జున్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదవశాత్తు రైలు నుంచి పడిపోయిన యువకుడిని చింతకుంటకు చెందిన ఇరువురు రైతులు గుర్తించి 108కు సమాచారం ఇచ్చారు. తీవ్ర గాయాలపాలైన యువకుడిని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు.

కార్యదర్శి అవినీతిపై విచారణ




ఫిర్యాదుదారుడు వెంకటసుబ్బారెడ్డితో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా గతంలో పనిచేసిన గురుమోహన్ అవినీతిపై మాజీ వార్డు సభ్యుడు మార్తల వెంకటసుబ్బారెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు గురువారం డీఎల్‌పీఓ తిమ్మక్క గోపవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోపవరం గ్రామ పంచాయతీలో లే అవుట్లలో అప్పటి కార్యదర్శి గురుమోహన్ అక్రమ వసూళ్లు చేశారని, లే అవుట్లకు అనుమతులు జారీ చేసే విషయంలో అవినీతికి పాల్పడ్డారని, 2019 నుంచి 2023 వరకు దొంగ సర్టిఫికెట్లతో గ్రామ పంచాయతీలో చెన్నకేశవ అనే ప్రైవేట్ వ్యక్తికి కార్యదర్శి, అప్పటి ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం జీతాలు ఇచ్చినట్లు మార్తల వెంకటసుబ్బారెడ్డి ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఫిర్యాదు మేరకు గతంలో ఓ మారు విచారణ చేశామన్నారు. ప్రస్తుతం కలెక్టర్, డీపీఓ ఆదేశాల మేరకు మరో మారు పునర్విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి వద్ద నుంచి అవినీతికి సంబంధించిన ఆధారాలను ఆమె సేకరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

అమ్మభాషకు అక్షర రూపమిద్దాం!

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



మదనపల్లె సిటీ : మనకు ఎన్ని భాషలు తెలిసినా మనసులోని భావాలను స్పష్టంగా వ్యక్తీకరించగలిగేది ఒక్క మాతృభాషలోనే. అలాంటి కమ్మనైన అమ్మభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందులో భాగంగానే వారి వారి మాతృభాషల పరిరక్షణకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఐక్యరాజ్య సమితి గుర్తించింది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన భాషలు కనుమరుగు కాకుండా కాపాడుకోవడమే లక్ష్యంగా యునెస్కో ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించింది. నాటి నుంచి వారి వారి మాతృభాషలను గౌరవించుకుంటున్నారు. కనీసం 30 శాతం మంది వారి మాతృభాషలను నేర్చుకోకపోయినా.. మాట్లాడకపోయినా ఆ భాష ఉనికికే ప్రమాదమని హెచ్చరించింది.

గతం.. ఎంతో ఘనం

రాజులు, నవాబుల పరిపాలనలో రాజ్యమేలిన భాషలు తెలుగు, ఉర్దూ. ఈ భాషలు రానురాను ప్రాభవం కోల్పోతున్నాయి. నేడు పాలనలో, పాఠశాలల్లో, ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ మాతృభాషలు అటు తెలుగు, ఇటు ఉర్దూ అమలు అరకొరగానే ఉంది.

తెలుగు వెలుగు కోసం..

తెలుగు వెలుగు కోసం పాలకులు చొరవ చూపాలని తెలుగు భాషాభిమానులు సూచిస్తున్నారు. తెలుగుభాషా రక్షణ, భాషాభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి తెలుగు అభివృద్ధి సాధికార సంస్థను నిధులు, విధులతో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

మాతృభాషల అభివృద్ధికి ఇలా చేయాలి..

- రాష్ట్ర స్థాయిలో అధికార భాష, ద్వితీయ అధికార భాష అయిన తెలుగు, ఉర్దూలను నిర్బంధంగా అమలు చేయాలి.
- గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర సచివాలయం వరకు ఉత్తర ప్రత్యుత్తరాలు మాతృభాషలో కూడా జరగాలి.
- ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి శాశ్వత భవనం ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు తెలుగు, ఉర్దూభాషాభివృద్ధికి వినియోగించాలి.
- పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు మాతృభాషలను నిర్బంధంగా అమలు చేస్తూ ప్రాథమిక స్థాయి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి.
- తెలుగు, ఉర్దూ అకాడమీలను, అధికారభాషా సంఘాలకు అధికారాలు, నిధులు, విధులు ఇచ్చి స్వయం ప్రతిపత్తి కల్పించి భాషాభివృద్ధికి కృషి చేయాలి.
- పోటీ పరీక్షలన్నింటినీ ఆంగ్లంతో పాటు తెలుగు, ఉర్దూ మాధ్యమ అభ్యర్థులకు 5 శాతం అదనపు మార్కులు కలిపి ప్రశ్నాపత్రాలను తెలుగు, ఉర్దూలో కూడా ఇవ్వాలి.

జాతి మనుగడకు భాషే ఆధారం



అమ్మ ఉగ్గుపాలతో నేర్చుకున్న భాషను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత తెలుగువారైన మనందరిపైనా ఉంది. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు మన తెలుగుభాషను అందించాలి. ఒక జాతి మనుగడ, వారు మాట్లాడే మాతృభాషపైన ఆధారపడి ఉంటుంది. తెలుగు భాషాభివృద్ధిలో భాగంగా ఏర్పాటైన తెలుగు అకాడమీలను బలోపేతం చేయాలి. – టీఎస్‌ఏ కృష్ణమూర్తి, ప్రముఖ నవలా రచయిత, మదనపల్లె.

అందరి బాధ్యత



అమ్మభాషలో ఉన్న కమ్మదనం ఇతర భాషల్లో ఉండదు. ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను విడవరాదు. ఇది ప్రభుత్వ బాధ్యతగా భావించకుండా అందరూ సమిష్టిగా మాతృభాషాభివృద్ధికి చొరవ చూపాలి.
– వీఎం నాగరాజు, మరసం సభ్యులు, మదనపల్లె.

తల్లిదండ్రుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నేటి తరం పిల్లలకు అమ్మభాషపై ఆసక్తి కలిగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఒక భాష విలసిల్లాలంటే దాన్ని మాట్లాడే వ్యక్తులు అధికంగా ఉండాలి. పరభాషలు నేర్చుకునే ప్రయత్నంలో అమ్మభాషకు అన్యాయం చేయకూడదు. – అంజలి, ఉపాధ్యాయురాలు, మదనపల్లె.

ద్వితీయ అధికార భాషగా ఉర్దూను అమలు చేయాలి



రాష్ట్రంలోని 13 జిల్లాలలోనూ ఉర్దూను ద్వితీయ అధికార భాషగా అమలు చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులున్నా అమలు పూర్తి స్థాయిలో జరగడం లేదు. తెలుగుతో సమానంగా ఉర్దూలో కూడా కార్యాలయాల్లో ఉత్తర, ప్రత్యుత్తర కార్యక్రమాలు అమలు చేసి ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలి. ఉర్దూ పాఠశాలలు, కళాశాలలు, డైట్‌లలో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ పోస్టులను భర్తీ చేయాలి. ఒక జాతి మనుగడ వారు మాట్లాడే మాతృభాషపైన ఆధారపడి ఉంటుంది.
– మహమ్మద్‌ఖాన్, రూటా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మదనపల్లె.

కూటమికి ఓట్లేసి ప్రజలు బాధపడుతున్నారు

జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారని.. ఇప్పుడు మోసపోయామని తెలుసుకుని బాధపడుతున్నారని జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎర్రగుంట్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధిని విస్మరించి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వ్యక్తిగతంగా తమ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తనను తిట్టడం తగదన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండి ఉంటే ఇప్పటికే ప్రజల ఖాతాల్లో రూ. లక్ష పడి ఉండేదన్నారు. ఎన్నికల్లో పోట్లదుర్తి గ్రామంలో ఎంపీ సీఎం రమేష్ నాయుడు నిజాయితీగా పనిచేయడం వల్లే ఆదినారాయణరెడ్డికి అక్కడ మెజార్టీ వచ్చిందన్నారు. కానీ తన సొంత పార్టీ నేత పనులనే ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారన్నారు. అందుకే ఎంపీ సైతం జమ్మలమడుగులోని పేకాట క్లబ్‌లపై స్వయంగా ఫిర్యాదు చేశారన్నారు. తమ హయాంలో ఒక్క ఫించన్ కూడా రద్దు చేయలేదని, ఇప్పుడు నియోజకవర్గంలో 2 వేలకు పైగా పింఛన్‌లు రద్దయ్యే పరిస్థితి ఉందన్నారు. వాటిని నిలబెట్టాలని కోరారు. ఎర్రగుంట్లలో డ్రైనేజీలో పూడికలు తీసేందుకు రూ.34 లక్షలు, నాలుగు రోడ్ల కూడలిలో రూ.10 లక్షలతో చేస్తున్న పనుల్లో అవినీతి కనిపిస్తోందన్నారు. ఇసుక మాఫియా, ఎర్రమట్టి, ఫ్లైయాష్ కోసం టీడీపీలోనే రెండు వర్గాలుగా విడిపోయి కుమ్ములాడుకుంటున్నారని విమర్శించారు. కొండాపురం ఆర్ అండ్ ఆర్ బాధితులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.12 లక్షలు ఇప్పించాలన్నారు. మొన్నటి ఎన్నికల్లో రాజకీయం తెలియని వారు కూడా గెలిచారని.. ఆదినారాయణరెడ్డి గెలవడం గొప్ప విషయం కాదన్నారు. సూపర్ సిక్స్ పథకాలే ఈ విజయానికి కారణమన్నారు. వ్యక్తిగత దూషణలు మాని ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కృషి చేయాలని ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు తమ్మిశెట్టి బాలయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జయరామక్రిష్టారెడ్డి, కౌన్సిలర్ మహమ్మద్ అలీ, పార్టీ నాయకులు నారపురెడ్డి, రామలింగారెడ్డి, నాగరాజు, ఇస్మాయిల్, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి. ఈశ్వరయ్య

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి. ఈశ్వరయ్య విమర్శించారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో కేంద్ర బడ్జెట్ పై వామపక్షాల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో మోడీ వికసిత్ భారత్ అంటూ బూటకపు మాటలు చెప్తుంటే, రాష్ట్రంలో బాబు విలవిల ఆంధ్ర అంటున్నారని ఎద్దేవా చేశారు. 2025 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ వారం రోజుల్లో పెట్టబోతున్నారని, ఈ బడ్జెట్లోట్‌లో వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి, పంట కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బాబు తరచూ రాష్ట్రంలో తమది ఎన్డీఏ కూటమి అని చెబుతున్నప్పటికీ విభజన చట్టం హామీల అమలుకు గాని, రాజధాని, పోలవరం నిర్మాణానికి గానీ కేంద్రం నుంచి గ్రాంట్ రూపంలో ఒక్క రూపాయి కూడా తెచ్చుకోలేకపోయారన్నారు. గండికోట, మైలవరం, చిత్రావతి, సర్వరాయ సాగర్, వామికొండ, బ్రహ్మ సాగర్, వెలుగొండ తదితర చిన్న, మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా 100 టీఎంసీలు నిలువకు అవకాశం ఉన్నా, పాలకుల నిర్లక్ష్యం కారణంగా నీరు లేక విలవిల పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచే ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ 2025 బడ్జెట్‌లో లేవన్నారు. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ, ప్రభుత్వ ఖర్చుల్లో కోతలు పెడుతోందన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు ప్రతి బడ్జెట్‌లో కొంత తగ్గిస్తూ ఆ పథకాన్ని లేకుండా చేయాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇదే జరిగితే గ్రామీణ పేదరికం మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, బి.మనోహర్, వి.అన్వేష్, సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎం.ఎల్ .న్యూ డెమోక్రసీ), సీపీఐ (ఎం.ఎల్ .లిబరేషన్), ఆర్.ఎస్.పి, ఫార్వర్డ్ బ్లాక్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వేగంగా వెళుతున్న వాహనంలో మంటలు



గుర్రంకొండ వద్ద వాహనంలో మంటలు చెలరేగడంతో కాలిపోయిన దృశ్యం

గుర్రంకొండ : వేగంగా రోడ్డుపై వెళుతున్న బొలేరో వాహనంలోఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే దిగిపోవడంతో ప్రాణాపాయం తప్పి, వాహనం ముందు భాగం మొత్తం కాలిపోయిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. పెద్దమండ్యం మండలానికి చెందిన రెడ్డెయ్య అనే వ్యక్తి టమాటా లోడుతో గురువారం కలకడ టమాటా మార్కెట్‌కు బయలుదేరాడు. మార్గమధ్యంలో గుర్రంకొండకు సమీపంలోని శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయం వద్ద బొలేరో వాహనం ముందుభాగం ఇంజిన్ వైపు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామంతో డ్రైవర్ రెడ్డెయ్య ఉక్కిరిబిక్కిరి అయిపోయి వెంటనే వాహనం నిలిపేసి దిగిపోయాడు. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడి వాహనం ముందుభాగం మొత్తం కాలిపోయింది. వాహనంలోని ఇంజిన్ భాగంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఉంటాయని అనుమానిస్తున్నారు. జరిగిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌కు బారికేడ్ల వితరణ



బారికేడ్లను ప్రారంభిస్తున్న భారతి సిమెంటు కంపెనీ ప్రతినిధులు, ట్రాఫిక్ సీఐ, తదితరులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు గురువారం భారతి సిమెంటు కంపెనీకి చెందిన 50 బారికేడ్లను వితరణగా అందించారు. ఈ సందర్భంగా భారతి సిమెంటు కంపెనీ మార్కెటింగ్ శాఖ వైస్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, మార్కెటింగ్ అధికారి కొండారెడ్డి, మేనేజర్ ప్రతాప్‌రెడ్డిలు ట్రాఫిక్ సీఐ హాజీవలిని కలిసి బారికేడ్లను ప్రారంభించారు. అలాగే పాత బస్టాండులో వెలసిన శ్రీపద్మావతి సమేత కళ్యాణ వెంకటరమణస్వామి ఆలయానికి కూడా 5 బారికేడ్లను భారతి సిమెంటు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా భారతి సిమెంటు తరఫున ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, భారతి సిమెంటు కంపెనీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దాల్మియా యాజమాన్యం వైఖరి దారుణం

–ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూములు ఇచ్చి సహకరించిన రైతుల పట్ల దాల్మియా యాజమాన్యం అన్యాయంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దాల్మియా యాజమాన్యం వంకలు, వాగులు ఆక్రమించి ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టడం వల్ల వర్షా కాలంలో వరదలు వచ్చిన ప్రతి సారి పంట పొలాలతో పాటు గ్రామాలను సైతం వరద ముంచెత్తుతోందన్నారు. దీనిపై నవాబుపేట, దుగ్గనపల్లి ఎస్సీకాలనీ ప్రజలతోపాటు చిన్నకొమెర్ల రైతులు అనేక సార్లు యాజమాన్యానికి మొరపెట్టుకున్నా వారు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. దీంతో మూడు గ్రామాల రైతులు లోకాయుక్తను ఆశ్రయించారన్నారు. ఇటీవల లోకాయుక్త కమిటీ ఈ ప్రాంతంలో పర్యటించి నష్టపోయిన రైతులకు, బ్లాస్టింగ్‌తో దెబ్బతిన్న నవాబుపేట గ్రామస్తులకు న్యాయం చేయాలని, దుగ్గనపల్లి గ్రామంలోని రైతుల పంట పొలాలకు పరిహారం ఇవ్వడంతోపాటు వారి గ్రామాన్ని వేరే చోటికి తరలించి శాశ్వతమైన పరిష్కారం చూపాలని లోకాయుక్త యాజమాన్యానికి సూచించిందన్నారు. అయితే యాజమాన్యం ఇవేమీ పట్టించుకోకుండా ఫ్యాక్టరీ విస్తరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపకుండా రెండో ప్లాంట్ విస్తరణకు వెళితే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. శుక్రవారం దాల్మియా చుట్టుపక్కల గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను, దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించనున్నట్లు రామసుబ్బారెడ్డి తెలిపారు. రైతుల పక్షాన తాము పోరాటం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొమెర్ల మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శివగురివిరెడ్డి, నవాబుపేట భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి



మృతి చెందిన శోభ (ఫైల్)

లింగాల : లింగాల మండలం ఎగువ లింగాల గ్రామానికి చెందిన అలవలపాటి శోభ(40) అనే మహిళపై ఈనెల 15వ తేదీ శనివారం విద్యుత్ స్తంభం పడింది. ఈ ప్రమాదంలో మహిళ కాలు పూర్తిగా రెండు ముక్కలై తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆమె చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. వివరాలిలా.. గత శనివారం తన పొలంలోని బుడ్డశనగ పంటను భారీ మిషన్‌తో నూర్పిడి చేశారు. తర్వాత పక్క పొలంలో బుడ్డశనగ పంట నూర్పిడికి కూలీలు తక్కువగా ఉన్నారని కొద్దిసేపు పంట నూర్పిడి మిషన్ వద్దకు రావాలని కూలీల మేస్త్రీ పిలవడంతో శోభ వెళ్లింది. బుడ్డశనగ పంట కుప్పలను మిషన్‌లోకి వేయడానికి వెళ్లగా భారీ మిషన్‌కు అడ్డంగా పైన ఉన్న విద్యుత్ తీగలను మిషన్ తగలగా.. సమీపంలోని విద్యుత్ స్తంభం విరిగి బుడ్డశనగ కుప్పను ఎత్తుతున్న శోభపై పడింది. దీన్ని తప్పించుకునే ప్రయత్నం చేయగా కాలిపై పడి రెండు ముక్కలైంది. విద్యుత్ స్తంభానికున్న కడ్డీ తలకు తగిలి బలమైన గాయమైంది. వెంటనే ఆమెను కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలు శోభకు భర్త బాల శేఖరరెడ్డి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఇరువర్గాల గొడవ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ఫైర్ స్టేషన్ సమీపంలో గాంధీనగర్ వద్ద గురువారం రాత్రి కొంతమంది యువకులు గొడవపడ్డారు. గాంధీ నగర్‌కు చెందిన కుమార్, పుష్పంత్.. అదే కాలనీకి చెందిన ప్రతాప్, ప్రదీప్, హరిలు రెండు వర్గాలుగా ఏర్పడి ఘర్షణకు దిగారు. ఈ సంఘటనలో కుమార్, పుష్పంత్‌లతోపాటు ప్రదీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పూలంగళ్ల సమీపంలోని రంగనాథ స్వామి తిరుణాలలో ఇరువర్గాలకు చెందిన వీరు మాటా, మాటా మాట్లాడి గొడవపడ్డారు. గురువారం ఇరువర్గాలు ఫైర్ స్టేషన్‌లో రాడ్లతో కొట్టుకోవడంతో వీరికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హంస వాహనంపై ఊరేగిన వీరభద్రస్వామి

చాపాడు : ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం సన్నిధిలో మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. రెండో రోజైన గురువారం రాత్రి వీరభద్రస్వామి, భద్రకాళీ మాత హంస వాహనంపై ఊరేగారు. ఆలయ ప్రాంగణంలో గణపతి, వల్లీ దేవసేన, సుబ్రమణ్యేశ్వర స్వామి, చండీశ్వర స్వామి, శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి, త్రిశూలేశ్వరస్వామి పంచమూర్తి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణంలో ఊరేగిన వీరభద్రస్వామికి వేలాది మంది భక్తులు పూజలు చేశారు.



హంసవాహనపై ఊరేగుతున్న భద్రకాళి సమేత వీరభద్రస్వామి

దళితులపై దాష్టీకం

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే టార్గెట్‌గా కక్షసాధింపు
- ముగ్గురికి సంబంధించిన గృహాల కూల్చివేత
- బాధితులను పరామర్శించిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి



కూల్చివేసిన దళితుల గృహాలు



ఎమ్మెల్యే ఆకేపాటికి తమ గోడు తెలుపున్న దళితులు

రాజంపేట రూరల్ : కూటమి నాయకుల దాష్టీకాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే టార్గెట్‌గా కక్ష సాధింపు చర్యలు ఎక్కువయ్యాయి. అన్నమయ్య జిల్లా రాజంపేటలో దళితుల గృహాలు కూల్చివేయడమే ఇందుకు నిదర్శనం. వివరాలు.. రాజంపేట మండల పరిధిలోని కూచివారిపల్లి పంచాయతీ కొమ్మివారిపల్లి దళితవాడలో వైఎస్సార్‌సీపీకి చెందిన గొంటు సుబ్బమ్మ, మద్దూరి సుబ్బలక్ష్మి, గొంటు ఈశ్వరమ్మలు ప్రభుత్వం అందజేసిన భూమిలో గృహాలను నిర్మించుకున్నారు.జిల్లా స్థాయి అధికారుల ఆదేశాలతో సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి, తహసీల్దార్ పీర్ మున్నీ, మన్నూరు సీఐ మహమ్మద్ అలీ దగ్గరుండి గృహాల కూల్చి వేతకు బుధవారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. పోలీసు బలగాలు, జేసీబీలతో రెవెన్యూ అధికారులు దళితవాడ వద్దకు వచ్చారు. తమ వద్ద ఉన్న పట్టాలను దళితులు చూపించినా కనికరం చూపలేదు. నోటీసులు ఇవ్వకుండా వచ్చారు కదా సమయం ఇవ్వండి అని వేడుకున్నా కరుణించలేదు. పేదలం.. గృహాలను కూల్చవద్దని ప్రాధేయ పడినా వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల పహారాలో బుధవారం రాత్రి 10గంటల వరకు కూల్చివేతలను కొనసాగించారు. ప్రభుత్వ భూమి అని చెబుతున్నా రెవెన్యూ అధికారులు దళితుల గృహాల పక్కనే ఉన్న కూటమి ప్రభుత్వానికి చెందిన వారి గృహాల వైపు కన్నెత్తి కూడా చూడక పోవటం గమనార్హం.

దళితుల గృహాలను కూల్చివేయటం దుర్మార్గపు చర్య : ఆకేపాటి

2 సంవత్సరాల కిందట దళితులు నిర్మించుకున్న గృహాలను అధికార యంత్రాంగం దౌర్జన్యంగా కూల్చివేయటం దుర్మార్గపు చర్య అని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మండి పడ్డారు. కొమ్మివారిపల్లి దళితవాడలో బుధవారం రెవెన్యూ అధికారులు కూల్చివేసిన దళితుల గృహాలను గురువారం ఎమ్మెల్యే ఆకేపాటి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఆకేపాటి రాగానే దళితులు పెద్ద ఎత్తున రోదిస్తూ తమకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. రెక్కాడితే కానీ డొక్కాడని దళితులమైన మేము అగ్రకులాల వారి మధ్య గృహాలను నిర్మించుకున్నందున కుల వివక్షతో కూల్చేశారని బోరున విలపించారు. కూల్చవద్దని ప్రాధేయ పడుతున్నా వినలేదని, మహిళలు అని చూడకుండా మా జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లారంటూ విలపించారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులు జిల్లా అభివృద్ధికి దోహదపడాలి కానీ కూల్చివేతలకు ఆదేశాలివ్వడం తగదన్నారు. అధికారులు పక్ష పాత ధోరణి విడనాడాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో గృహాలను కూల్చివేయాల్సిన అవసరం అధికారులకు ఏముందని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సమస్యలు సృష్టిస్తే సహించేది లేదన్నారు. రాజంపేట నియోజకవర్గంలో ఎపుడూ లేని విష సంస్కృతికి బీజం వేసేందుకు కూటమి నాయకులు ప్రయత్నించటం సరి కాదన్నారు. దళితులకు నష్ట పరిహారం చెల్లించి, గృహాలను నిర్మించే వరకు పోరాటం చేస్తామని తెలియజేశారు. దళితులను ఆదుకోవల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు ఏబీ సుదర్శన్‌రెడ్డి, మూరి గోవర్ధన్‌రెడ్డి, పాటూరు భరత్‌కుమార్ రెడ్డి, అనుదీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.విశ్వనాథరెడ్డి, కే. గోపిరెడ్డి, జేవీ కృష్ణారావు, జీ. త్రినాథ్, డి. బాస్కర్‌రాజు, శంకరయ్యనాయుడు, ఏ.సౌమిత్రి, ఎస్.నవీన్‌కుమార్, ఏ. వరదరాజు, దండు గోపీ, దాసరి పెంచలయ్య, జీవీ సుబ్బరాజు, ఆర్.కమలాకర్, ఆర్.గురుమూర్తి, ఏ.మధుబాబు, కె.రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.